# రక్తయజ్ఞం

## శ్రీ కలువకొలను సదానంద

(గతసంచిక తరువాయి)

### 9

వాన!

పాతబడిన పెంకుటింటి కప్పుల్లోనుంచి నీళ్ళుకారింది. నేలంతా తడిసింది. పడుకోటానికి చోటులేదు.

మంచంమీద – సుశీల పాపను కావలించుకుని పడుకుంది. సుందరానికి చోటులేదు. అతడు స్టూలుమీద కాళ్ళు చాపుకుని వాలుకుర్చీలో పడుకున్నాడు. మూడుజాములు గడిచిపోయాయి. అతనికి నిద్రపట్టలేదు. కళ్ళు మండుతున్నాయి. కాళ్ళు తిమ్మిరెక్కిపోతున్నాయి.

మంచం కిర్రుమంది, సుశీల నిద్రకళ్ళతో లేచి కూర్చుంది. సుందరంవైపు చూచి 'నిద్రపోలేదూ ?' అంది.

'నువ్వు నిద్రపో సుశీ!'

'కాస్సేపు మంచంపైన పడుకో బావా! నేను ఈజీచేర్‌లో పడుకుంటాను.' అంటూ ఆమె మంచందిగింది.

సుందరం మంచంమీద పడుకున్నాడు. పాపబుగ్గమీద మెల్లగా ముద్దుపెట్టుకున్నాడు. పొట్టమీద చెయ్యివేసుకుని మత్తుగా కళ్ళు మూసుకున్నాడు.

మరుక్షణం—'కర్‌ర్‌ర్' మంటూ అసహ్యంగా కాకి అరిచింది. మంచంమీద పడుకున్న సుందరం చిరాకుపడుతూ కళ్ళుతెరిచాడు. 'ఇప్పుడేగా పడుకున్నాను ? అప్పుడే తెల్లారి పోయిందా ? ఐదునిమిషాలైనా నిద్రపోలేదే!'

మంచంమీద పాప కనిపించలేదు. సుశీలకూడా లేదు. అంతా కల! తెల్లవారిపోయింది. రాత్రి వాన పడలేదు. తాను బాగానే నిద్రపోయాడు. అయినా—రాత్రంతా నిద్రపోనట్టు, ఇప్పుడే పడుకుని లేచి కూర్చున్నట్లు వుందతనికి.

పాడుకాకి! పెరటిగోడమీద వాలి పరమ అసహ్యంగా అరుస్తోంది. కాకి అంత వికారంగా అరవడం అతడెప్పుడూ వినలేదు.

'కర్‌ర్‌ర్!

సుందరం లేచి వెళ్ళి కాకిని అదలించాడు.

ఎంత చిత్రమైన కల!

ఇంకా పెళ్ళి కాకుండానే – కొన్నేళ్ళముందున్న బ్రతుకును కళ్ళకు కట్టినట్లు చూపించింది. అది కలెందుకౌతుంది? జరగబోతున్న నిజమేకదా!... తనకు పెళ్ళవుతుంది. సుశీల కాపురానికొస్తుంది. ఆమెకు పాప పుడుతుంది. ఖర్చులెక్కువవుతాయి. జీతం చాలదు. అప్పటికి ఈ పెంకుటిల్లుకూడా బాగా పాతబడిపోతుంది. మరమ్మత్తు చేయించటానికి డబ్బుండదు. వర్షం కురుస్తే ఇల్లంతా కారుతుంది. నేలమీద పడుకోటానికి వీలుండదు. పాపను పక్కనవేసుకుని, సుశీల మంచంమీద పడుకుంటుంది. తనకు మరో మంచం వుండదు. వాలుకుర్చీలో పడుకోవాలి. వేకువజామున లేచి పాప పక్కన పడుకోవాలి! దారిద్ర్యంకూడా సుఖప్రదంగానే వుంటుంది! ఎంత మంచికల! ... ఇంతలో ఆ కాకి అలా అరవడం మాత్రం ఏమీ బాగాలేదు. నల్లనికాకి! సంతాపచిహ్నంలాంటికాకి!

సుందరం పెళ్ళి—ఎల్లుండి సూర్యోదయాత్పూర్వం!

వేసవిసెలవులు గనుక బడిలేదు. అతను మధ్యాహ్నం వరకూ యింట్లోనే వున్నాడు. టేబుల్ సొరుగులో పెళ్ళిపత్రికలు కొన్ని మిగిలిపోయాయి. ఒక పత్రికను చేతబట్టుకుని చూస్తూ కూర్చున్నాడు. తనపేరు, సుశీలపేరు అచ్చులో ముచ్చటగా వున్నాయి. కొన్ని పత్రికలు జాగ్రత్తగా దాచిపెట్టుకోవాలి. ముసలివాళ్ళయ్యాక వీటిని చూసుకుని బోసినవ్వులు నవ్వుకోవచ్చు!

సుందరం మధ్యాహ్నం దర్జీవాడి దగ్గర కొత్తబట్టలు తీసుకుని యింటికి తిరిగివస్తూంటే-దారిలో రామలింగం కనిపించాడు.

'నీకోసం మీ యింటికి వెళ్ళానురా! నువ్వు లేవు...' అన్నాడు

'ఏమిటీ సంగతి ?'

'ఎప్పుడు ప్రయాణం ?'

'రేపు మధ్యాహ్నం.'

'రాత్రికి వుంటావన్నమాట! అయితే చెప్పు. బొమ్మా, బొరుసా ?' అంటూ రామలింగం రూపాయిబిళ్ళ చేతపట్టుకున్నాడు.

'బొమ్మేమిటీ, బొరుసేమిటీ ?'

'వూరికే-చెప్పవోయ్ !'

'బొమ్మ !'

రామలింగం రూపాయిబిళ్లను ఖంగున పైకెగరేశాడు. బొరుసు పడింది.

'ఒరే సుందరం ! నువ్వు ఓడిపోయావు గనక నామాట వినాల్సిందే ! ఈరాత్రి మనిద్దరం సినిమాకు వెళ్దాం !'

'సినిమాకు ఈరోజే వెళ్ళాలా ఏమిట్రా ? మరెప్పుడైనా వెడదాం ! రాత్రికి బాగా నిద్రపోవాలి.'

'నీకు పెళ్ళాం వొచ్చిన తరవాత మనిద్దరం కలిసి వెళ్ళడం కుదరదు. కనుక ఈరోజు మనం వెళ్ళాల్సిందే'

'అది కాదు రామలింగం...'

'ఇక మాట్లాడకు ! నేను నీతోడుపెళ్ళికొడుకు ననుకో !... అందరూ ఈ సినిమా చాలా బాగుందంటున్నారు. ఈరోజే ఆఖరు. మొదటి ఆటకు యిద్దరం వెళ్దాం! సరే అను !'

'...సరే'

'రైట్ ! సాయంకాలం రెడీగా వుండు!' అంటూ రామలింగం వెళ్ళిపోయాడు.

సుందరం యిల్లు చేరుకున్నాడు. పెళ్ళికి తరలివెళ్ళడానికి అవసరమైన సామానులన్నీ సర్ది పెట్టుకున్నాడు.

సాయంకాలమైంది.

'పాలు తాగు రా!' అంది రాజమ్మ.

సుందరం గ్లాసు అందుకుని, పెదవుల దగ్గరికి చేర్చుకోబోయాడు. బయట రామలింగంగొంతు వినిపించింది.

'సుందరం!'

సుందరంచేతిలోని పాలగ్లాసు జారి క్రింద పడింది.

'అంతపాలు కింద ఒలకబోసేవేమిట్రా?' అంటూ రాజమ్మ నొచ్చుకుంది.

'చెయ్యి జారిపోయింది. పోతే పోయిందిలే! నేను సినిమాకు వెళ్ళొస్తానమ్మా!

'హోటల్లోనైనా కాఫీ తాగి వెళ్ళు!'

సుందరం, రామలింగం హోటల్లో కాఫీ తాగి సినిమాకు బయలుదేరారు.

'మీ మామగారు కట్నం ఎంతిస్తున్నారు సుందరం?'

'కట్నం ఎందుకూ?'

'పిల్లనిస్తే చాలంటావు! మీ అత్తకూతుర్ని ప్రేమించావా ఏమిటీ?'

సుందరం సన్నగా నవ్వాడు.

'నేను మాత్రం నీలాగా పిచ్చివాణ్ణి కాదలుచుకోలేదు. ఒక్క పెళ్ళాంకంటే ఎక్కువమంది వుండకూడదనే చట్టం వుంది కాబట్టి ఆ ఒక్క పెళ్ళిని సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కువ కట్నం తెచ్చే పిల్లనే నేను పెళ్ళి చేసుకుంటాను. డబ్బు తెచ్చిన పెళ్ళాన్ని మరీ గాఢంగా ప్రేమించవచ్చు.

'అది నీబోటివాళ్ళ లక్షణం లేరా!'

ఇద్దరూ సినిమా థియేటరు చేరుకున్నారు. ఆ వూరికంతా అదొక్కటే థియేటరు. ఊరిచివర వుంది. రామలింగం-తానే యిద్దరికీ టిక్కెట్లు కొన్నాడు.

రంగుల్లో తీసిన పౌరాణిక చిత్రం అది, అందులో శ్రీరాముడు అందంగా, కనులవిందుగా వున్నాడు. అతని ఒళ్ళంతా నీలంగా వుంది. బ్రతికినంత కాలం సీతకోసం ఏడ్చాడు రాముడు. చివర-ఆమె భూదేవికడుపున లీనమైపోయింది. అంతటి సుందరుడు, సుజనుడూ అయిన శ్రీరామచంద్రుణ్ణి విషాదానలం కాల్చివేసింది. అతడు ఉత్తమోత్తముడు! ఏ పతివ్రతకూ తీసిపోనంతటి పవిత్రత అతనిది! ఏకపత్నీవ్రతాన్ని ఆచరిస్తూ ఆ పత్నికి కూడా దూరమైన భాగ్యహీనుడు! పాపం...సీతారాములు!

సినిమా వదిలారు.

సుందరం, రామలింగం బయటకు వచ్చారు.

'అలా ఏట్లోకి వెళ్ళివద్దాం రారా!' అన్నాడు రామలింగం.

'ఆకలేస్తోందిరా! ఇంటికిపోదాం!'

'ఓ అయిదునిమిషాల్లో వచ్చేద్దాం పద!' అంటూ అతని భుజంమీద చెయ్యివేశాడు రామలింగం.

రెండు ఫర్లాంగుల దూరంలో ఏరు వుంది. ఇద్దరూ రోడ్డు మీద నడుస్తున్నారు. జనమంతా వెళ్ళిపోయారు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వాళ్ళ ముందర–కాస్త దూరంలో ఒక మనిషి నడిచి పోతున్నాడు. వెనక మరొకతను బీడీ తాగుతూ వస్తున్నాడు.

నిండు పున్నమి!

ఏ ఆలోచనలూ లేక అమాయకంగా వెలిగే పసిపాప చూపులకు మల్లే తేటగా వుంది వెన్నెల! పాపాయి కక్కివేసిన పాలకుమల్లే తెల్లగా వుంది!

ఇద్దరూ ఏట్లోకి వచ్చారు.

ఏట్లో ఇసుక–ఆరబోసిన పిండిలా తెల్లగా వుంది. ఏటిగట్టు మీది చెట్ల చిటారు కొమ్మలు వెన్నెలలో తళతళ లాడుతున్నాయి. చెట్లక్రింది నీడలు నల్లగా వున్నాయి. గాలికి కదిలే ఆకుల గలగలలు తప్ప మరే అలికిడీ వినిపించటంలేదు.

వాళ్ళముందు వెడుతూన్న మనిషి ఆగాడు.

'అగ్గిపెట్టె వుందా?' అని అడిగాడు.

'లేదు! వెనక ఎవరో బీడీ తాగుతూ వస్తున్నారు, ఆయనడుగు!' అన్నాడు రామలింగం.

వెనక వస్తూన్న మనిషి–సమీపించాడు. వెలుగుతూన్న బీడీని అవతల పారేశాడు. మొదటివాడు అతన్ని నిప్పు అడగలేదు.

ఆ ఇద్దరూ హఠాత్తుగా సుందరాన్ని రెక్కలు విరిచి పట్టుకున్నారు. నోట్లో గుడ్డ కుక్కారు. రెండు చేతులూ వెనక్కు విరిచి కట్టేశారు. సుందరం భయాశ్చర్యాలతో స్తంభించిపోయాడు. వెర్రిగా పెనగులాడాడు. వాళ్ళలో ఒకడు చాకుతీసి మెల్లగా వీపున తాకించాడు. 'పిచ్చివేషాలు మాని, చెప్పినట్టు విను. నడూ!' అన్నాడు.

సుందరం ఆశతోను, విస్మయంగాను రామలింగంవైపు చూశాడు.

'అంతే సుందరం!' అన్నాడు రామలింగం.

వాళ్ళు ముగ్గురూ అతన్ని జాగ్రత్తగా పట్టుకుని, చెట్లను మరుగు చేసుకుంటూ ప్రక్కనేవున్న కొండవైపు నడవసాగారు.

ఈ ఆకస్మిక సంఘటనను సుందరం వూహించలేదు. ఇదంతా ఒక భయంకర స్వప్నంలా వుందతనికి. అతను భయపడిపోయాడు. ఏవేవో ఆలోచనలు అతని మనస్సులో అల్లిబిల్లిగా అలుముకోసాగాయి.

...రామలింగం! నువ్వా! ఇలా చేశావు? మిత్రునికే ఘాతకాన్ని తలపెట్టేంత నీచత్వానికి దిగజారిపోయావా నువ్వు? ఇందుకేనా మధ్యాహ్నంనుంచీ నన్ను అంటిపెట్టుకున్నావు? ఛీ! నీలాంటివాణ్ణి కన్నందుకు స్నేహం సిగ్గుపడుతోంది!...

రామలింగం సుందరానికి ముఖం చూపటానికి సిగ్గుపడి, వెనక నడుస్తున్నాడు. కొండవారగా, రైలుకట్టప్రక్కన నడిచిపోతున్నారు వాళ్ళు.

సుందరంపరిస్థితి అయోమయంగా వుంది. వీళ్ళు తనను ఎందుకిలా పట్టుకున్నారు? ఎక్కడికి తీసుకుపోతున్నారు? ఏం చేస్తారు?...ఉదయం అసహ్యంగా అరిచిన కాకి, సాయంకాలం నేల పాలైన పాలు జ్ఞాపకం వచ్చాయి. అతని ఒళ్ళు గగుర్పొడిచింది.

ఎదురుగా గూడ్సురైలు వస్తోంది.

'ఒరేయ్! బండివస్తోంది. బండిలో వాళ్ళు చూస్తారేమో!' అన్నాడు ఒకడు.

బొరియలాగావున్న రైలువంతెనకిందికి సుందరాన్ని లాక్కుపోయారు వాళ్ళు. ధణధణమంటూ గూడ్సురైలు వెళ్ళిపోయింది. సుందరం మనస్సులో గౌరి తళుక్కున మెరిసింది. అతనిముఖం పాలిపోయింది. శరీరంలో రక్తం చల్లబడిపోయింది. 'నీకు వాటిల్లిన ఈ దురవస్థకు కారణం గౌరి' అంటూ అతని అంతరాత్మ అతనితో గుసగుసలాడింది. అతను కదలలేకపోయాడు.

వాళ్ళు అతన్ని వంతెనలోపలినుంచి బయటికి లాగారు.

...ఏం జరిగింది? తన రహస్యం బయటపడిందా ? ఇప్పుడేం జరగబోతున్నది? పర్యవసానం ఎలా వుంటుంది?...అతనికాళ్ళు తడబడ్డాయి.

రామలింగం సుందరంప్రక్కకు వచ్చాడు. భుజంమీద చెయ్యి వేశాడు...'సుందరం! గాభరా పడకు! నీకు కీడుచేసే ఉద్దేశం నాకు లేదు. నీకు ఎలాంటి అపాయమూ జరగదు! కాకపోతే ఒకచిన్నమార్పు! అంతే! వర్షంలో హోటలుకు వెడితే, గొడుగులు మారిపోయినట్టు!... ఏ గొడుగైతేనేం? జింకమార్కో–, ఏనుగుమార్కో–ఏదైనా పని కొచ్చేదే!...ఏం భయంలేదు. ధైర్యంగా వుండు!' అన్నాడు.

...రామలింగం! నేను నీ మిత్రుణ్ణిరా! కొద్ది నిమిషాల క్రితం దాకా నిన్ను నమ్మానురా! నన్ను యిలా వంచించి నువ్వేం చేసినా నేను భరించలేను. ఒరేయ్! నన్ను విడిచిపెట్టేయ్ నేను యింటికి వెళ్ళిపోతాను. మా అమ్మ నాకోసం ఎదురుచూస్తుంటుందిరా ! ఒరే రామలింగం ! మై డియర్ ఫ్రెండ్ ! మిత్రద్రోహీ !...

సుందరం మొండికెత్తినట్లు ఆగిపోయాడు.

వాళ్ళు అతన్ని బలంగా ముందుకు నెట్టారు.

చేలు, రాళ్ళు, వాగులు, మామిడితోటలు దాటుకుంటూ వాళ్ళు ఒక మైలుదూరం నడిచారు. కొండ ప్రక్కన ఒకచోట ఆగారు

కొండమీదుగా రాతిబండల నడుమ సుబ్రహ్మణ్యస్వామిగుడి — వెన్నెల్లో తెల్లగా కనిపిస్తోంది. కొండదిగువ—గుడికివెళ్ళే దారికి యిరు ప్రక్కలావున్న చెట్లు గాలికి మెల్లగా కదులుతున్నాయి. చెట్ల ప్రక్కనున్న కోనేటిలోని నీళ్ళు చల్లగా నిద్రపోతున్నాయి. గట్టుమీదికప్ప కోనేటిలోకి దూకిందేమో—నీళ్ళు 'క్లంగు' మంటూ ఉలికిపడి, మళ్ళీ నిద్రకు ఉపక్రమించింది.

దారి ప్రక్కనే ఒక పూరిల్లువుంది. ఆ యింటితలుపు దగ్గరగా వేసివుంది. కిటికీ సందుల్లోంచి గుడ్డిదీపపు వెలుతురు బయటికి ప్రసరిస్తోంది. అందులో—దేవాలయార్చకుడు కాపురం వుంటున్నాడు.

వాళ్ళు కల్యాణ మంటపాన్ని సమీపించారు. అక్కడినుండి గుడివరకూ కొండమీదుగా రాతిమెట్లున్నాయి·

సుందరం అనుమానం నిజమైంది. కల్యాణ మండపంలో పెట్రోమాక్సులైటు వెలుగుతోంది. ఆ వెలుగులో మొట్టమొదట అతనికి గౌరి కనిపించింది. నాగరాజు గంభీరంగా నిలబడి వున్నాడు. అతనిప్రక్కన వాసు వున్నాడు. మరో యిద్దరు మగవాళ్ళుకూడా వున్నారు. గౌరితప్ప మరోస్త్రీ అక్కడలేదు. అతని చూపులకు—సుందరంగుండె జలదరించింది. అతన్నిచూచి గౌరి తలవంచుకుంది.

రామలింగం సుందరం కట్లు విప్పాడు. అతనినోట్లో కుక్కిన గుడ్డను లాగేశాడు.

'ఏమిటిది ?...' అన్నాడు సుందరం, అదురుతున్న కంఠంతో

అతని ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

ఒకడు పూజారియింటి వద్దకు వెళ్ళి, అతన్ని వెంటబెట్టుకుని తిరిగివచ్చాడు.

పూజారి కళ్ళు నులుముకుంటూ వేదికమీద చతికిలబడి, సమిధలుపేర్చి, 'అమ్మాయిని, అబ్బాయిని యిలావచ్చి కూర్చోమనండి'! అన్నాడు.

నాగరాజు గౌరిని వేదికమీద కూర్చోబెట్టాడు.

సుందరం పెదవులు కోపంతో వణికాయి. ''ఏమిటీ దౌర్జన్యం? నన్ను వెళ్ళనివ్వండి!' అంటూ విసురుగా వెనక్కు తిరిగి వేగంగా నాలు గడుగులు నడిచాడు. వాసు అతనిమీదికి దూకి చొక్కా కాలరు ఒడిసి పట్టుకుని, వేదికదగ్గరకు లాక్కువచ్చాడు. సుందరం పెనుగులాడాడు.

'నీకంటే రౌడీని నేను! చచ్చినట్టు కూర్చో ! లేకుంటే ముక్కు పచ్చడి చేసేస్తాను!' అంటూ చెయ్యి పైకెత్తాడు వాసు.

'ఏయ్ వాసూ! ఏమిటూ దుడుకు ? వూరుకో !' అంటూ అతన్ని ప్రక్కకు నెట్టాడు నాగరాజు. సుందరంభుజంమీద చెయ్యి వేసి, అతని ముఖంలోకి చూసి వికటంగా నవ్వాడు. సారా వాసన గుప్పు మంది. అతడు తప్పతాగి వున్నాడు. అతని మాటలు తడబడు తున్నాయి. 'అల్లుడూ! నువ్వు నా అల్లుడివి ! నేను నీ మామను ! అది నీ పెళ్ళాం! నిన్ను చంపేసేవాణ్ణే ! ఐతే నువ్వు నా అల్లుడివి! నోరు మూసుకుని కూర్చో అల్లుడూ!' అంటూ అతన్ని వేదికమీదికి తోశాడు.

సుందరానికి ఒక్కసారిగా ఏడుపొచ్చేసింది.

'నా మీద ఎందుకు మీరిలా పగబట్టారు? నేను మీకేం అప కారం చేశాను? మీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను వెళ్ళిపోనివ్వండి ! రేపే నాకు పెళ్ళి! నా బ్రతుకు చెడగొట్టకండి! నన్ను భ్రష్టుణ్ణి చెయ్యకండి! నన్ను విడిచిపెట్టేయండి!' అంటూ పసివాడిలా ఏడ్చాడు.

పురోహితుడు చివాలున పైకిలేచి నిలబడ్డాడు. నాగరాజు వైపు కోపంగా చూశాడు. 'ఇదేదో దొంగపెళ్ళి అని మాత్రం అనుకున్నానుగానీ, బలవంతపు పెళ్ళి అని నాకు తెలియదు. ఈ పాపం నాకెందుకూ? మీకు బుద్ధి లేకపోతే, నాకూ బుద్ధి లేదనుకున్నారా?' అంటూ వేదిక దిగాడు.

నాగరాజు కళ్ళలో కత్తులు మెరిశాయి. చేతితో మీసం మెలి పెడుతూ, ఓ విషపు నవ్వు నవ్వాడతను. పురోహితుడు మళ్ళీ గబుక్కున వేదికమీదికెక్కాడు. 'పిలిచి పిల్లనిస్తానంటే వొద్దంటా వేమిటి నాయనా?...సరే అను!' అంటూ సుందరాన్ని మందలించాడు.

నాగరాజు సుందరంప్రక్కన నిలబడ్డాడు.

'నిన్ను విడిచిపెట్టేయాలా అల్లుడూ! రేపు నీకు పెళ్ళా? నీ బతుకు చెడిపోకూడదు. నిన్ను భ్రష్టుణ్ణి చెయ్యకూడదు. సరే! బాగానే వుంది! అయితే నా కూతుర్ని ఏం చెయ్యమంటావల్లుడూ? దాన్ని ఏ నూతిలో తొయ్యమంటావు? దానికెందుకు కడుపు చేశా వల్లుడూ?'

పురోహితుడు ఆశ్చర్యాన్ని అభినయించాడు. 'ఆఁ ఆఁ! అంతపని చేసేనా, యిప్పుడీ నంగిమాటలు మాట్లాడుతున్నాడు? మంచి పెద్ద మనిషే! ముఖం చూచి, ఈ పిల్లి కూడా పాలు తాగుతుందా అను కున్నాను. పావలాడబ్బుతో దులిపేసుకునే సాని అనుకున్నావా, పది కాలాలపాటు బ్రతికే కన్నెపిల్ల అనుకున్నావా ? కట్టవయ్యా తాడు! ఇక మారుమాటాడకు!'

సుందరం అదిరిపడ్డాడు.

ఏమిటీ విధివైపరీత్యం? గౌరి గర్భం ధరించిందా? తన పాలిటికి పిడుగుపాటులా వుంది ఈ వార్త !

'అబద్ధం! మీరందరూ కలిసి నాటకమాడుతున్నారు. మీరు మోసగాళ్లు! గూండాలు!' అంటూ అరిచాడతను.

గౌరి తలపైకెత్తి అతనివైపు చూచింది. సుందరం కంపించిపోయాడు. ఆమెచూపుల్లో నిజం తొంగిచూస్తోంది.

...అయ్యో గౌరీ! ఎంతపని చేశావు ! అంతా నీ సంకల్పం ప్రకారమే జరుగుతూన్నట్టుంది ! నన్ను తిట్టాలనుకుని తిట్టావు. కొట్టించాలనుకుని కొట్టించావు. నన్ను పొందాలనుకుని పొందావు. గర్భం కూడా ధరించాలనే ధరించావా ? నాకెంత సంకటాన్ని తెచ్చిపెట్టావు! న్యాయాన్ని నీవైపు కట్టిపడేసుకున్నావు. గెలుపు నీదే ! గర్వం నీకుగాక మరెవరికుండాలి? నామీద యింత ఘోరంగా ప్రతీకారం తీర్చుకోవడం తగదు గౌరీ!...

సుందరం నిశ్చేష్టుడైపోయాడు. శక్తి లేని అతని మెదడు అరిగిపోయిన రికార్డులా ఏడుస్తోంది.

'నాయనా ! ఏదో పొరబాటు చేశావు. నీవల్ల నా పరువు, నా కూతురి బతుకు నాశనం కాబోతున్నాయి. లేకుంటే - నీ గురించి పట్టించుకునేవాణ్ణి కాను! తప్పుచేశావు గనుక, దీన్ని కాపాడే భారం కూడా నీదే!' అన్నాడు నాగరాజు.

'నాగరాజూ!...' అన్నాడు సుందరం. 'నేను పొరబాటు చేయలేదు నాగరాజూ! మీ అమ్మాయిమీద నాకు ఎలాంటి పాడు ఆలోచనా లేదు. సిగ్గు విడిచి చెబుతున్నాను. ఆమె నన్ను బలవంతం చేసింది. ఆమె నా బ్రతుకును నాశనం చేస్తోంది.'

'ఏమైతేనేం? తప్పుచేశావు. దానికి నెలతప్పింది'

...అయ్యో! లేదు లేదు! పట్టుకుని పంగనామాలు పెడితే మాత్రం దాసరవుతాడా ? గౌరి నన్ను పట్టుకుని పంగనామాలు పెట్టింది. నేను తప్పుచేయలేదు. గౌరి నాచేత తప్పు చేయించింది. నా మనస్సు ఆమెతో వ్యభిచరించలేదు. నా శరీరంతో ఆమె ఆనందించింది. ఆమె పాపం చేసింది. నన్ను బోనులోకి ఎక్కిస్తూవుంది...

సుందరంలో తీవ్రమైన సంఘర్షణ ప్రారంభమైంది.

... తప్పు జరిగింది. ఆ తప్పు అణువంతే కావచ్చు. అది గౌరి కడుపులో వ్రణంలా పెరిగి పెద్దదై బయట పడబోతున్నది. సుందరం! ఒరే దౌర్భాగ్యుడా! ఆ వ్రణాన్ని కడిగి మందు వెయ్యాల్సినవాడివి నువ్వే! తప్పదు! నువ్వు పద్మవ్యూహంలో చిక్కుకున్నావు. బయటపడలేవు. నీ చుట్టూ ఎలాంటివాళ్లున్నారో చూడు!...

...నిజమే! ఒప్పుకుంటాను. నమ్మబలికి, అనుభవించి, అవతలికి పారిపోయే స్వభావం నాకు లేదు. అయితే నా జీవితంలో ఇలాంటి మలుపును నేను ఆశించలేదు. నేను మొదటినుంచీ ఒకే దారిలో వెళ్లాలనుకున్నాను. ఆ దారిలో నడిచి నా సుశీలను అందుకోవాలనుకున్నాను. మధ్యలో — నా అంగీకారంతో నిమిత్తం లేకుండా గౌరి ఓ తప్పు చేసింది. ఆ తప్పు నాపాలబడింది. అదే శాసనంగా మారి, నన్ను నా దారిలోనుండి మళ్లించడం మహాఘోరం ! ఈ మార్పును భరించగల ఆత్మస్థైర్యం నాకు లేదు. నేను చాలా బలహీనుణ్ణి ! నా సుశీలను ఎలా ఒదులుకోగలను? అయ్యో ! ఆ కలయిక సుశీలతో జరిగివుండకూడదూ? ఆమె గర్భవతి అయివుండకూడదూ ? ఆమెను కాపాడటంకోసం నా మానప్రాణాలైనా త్యాగం చేసివుండనూ ? ... గౌరీ! నువ్వు నా మనస్సులోని కోరికల్ని పసికడుతూ ఎత్తులు వేస్తున్నావా? నా బిడ్డ నా సుశీలకడుపులో ప్రాణం పోసుకోవాలని ఉవ్విళ్లూరాను. బందిపోటుదొంగలా నువ్వు నన్ను దోచుకున్నావు. దోచుకున్న నా సొత్తుకు నన్నే కాపలాదారుగా వుండమని ఒత్తిడి చేస్తున్నావు. వద్దు గౌరీ! నన్ను విడిచిపెట్టేయి. నా దారిని నన్ను పోనివ్వు! ఇలా ప్రార్థిస్తున్నందుకు నాకు సిగ్గు వేస్తోంది! అయితే ఏంచెయ్యను? నేను స్వార్థపరుణ్ణి! ఈ జన్మ మళ్లీ రాదు. ఈ జన్మను నీకు త్యాగం చేయలేను గౌరీ!...

పురోహితుడు మంత్రాలు వల్లిస్తున్నాడు. దూర్వాసుడి శాపాల్లా కటోరంగా వినిపిస్తున్నాయి ఆ మంత్రాలు. సుందరం అనిమిషనేత్రాలతో ఎక్కడో దూరంగా చూస్తున్నాడు. దూరంగా వెన్నెల్లో ఊరు పెన్సిల్ డ్రాయింగ్‌లా కనిపిస్తోంది. కొండ దిగువ రైలుపట్టాలు మలుపుతిరిగినచోట ప్రతిఫలిస్తోన్న వెన్నెల వంపులు కటికవాళ్ల కత్తుల్లా మెరుస్తున్నాయి ... ఈ పండువెన్నెల మహా భయంకరంగా వుంది!

సుందరం గుండె ఝల్లుమంది. 'అబ్బాయ్ ! తాళిబొట్టు కట్టు!' అంటూ మంగళసూత్రం అతని చేతిలో పెట్టాడు పురోహితుడు. అది అతనిచేతిలో నిలవకుండా జారిపోయింది.

నాగరాజు ముందుకు వంగాడు. 'కట్టు' అన్నాడు. సుందరం మూగవాడిలా అతనివైపు చూశాడు.

...నాగరాజూ! ఈ పెళ్లి జరక్కపోతే నీ పరువు పోతుంది' ఆ పెళ్లి ఆగిపోతే నా పరువు పోతుంది. అయ్యో! నన్నెందుకిలా వేధిస్తావు... విధిరాకాసీ! నువ్వు రూపాయిబిళ్లను పైకెగరేసి, బొమ్మా బొరుసా— అని అడిగావు. నేను బొమ్మ కావాలన్నాను. నువ్వు బొరుసు వేస్తున్నావు. వద్దువద్దు! నాకు బొమ్మే కావాలి!

'మాట్లాడవేం?' అన్నాడు నాగరాజు.

...ఎలా మాట్లాడను ? ఏమని మాట్లాడను ? పంచేంద్రియాలూ నా అదుపు తప్పిపోతున్నాయి. నాకు మాటలు రావటంలేదు. ఇప్పుడే ఈ నేలమీద పడినట్లుంది నాకు ! పురిటి పాపలా ఏడవటం తప్ప, నాకు మాట్లాడటం చేతకాదు...

అందరూ అతనిచుట్టూ చేరి ఒత్తిడి చేయసాగారు.

'ఎంతసేపు యిలా బెల్లంకొట్టినరాయిలా కూర్చుంటావు ? నిన్ను వూరికే చేసుకోమనటంలేదు. నువ్వు ఏమడిగినా యిస్తాను. అమ్మాయికి బొట్టుకట్టు!' అంటూ మంగళసూత్రం అతని చేతిలో పెట్టాడు నాగరాజు.

...వద్దు ! నువ్వు నాకేమీ యివ్వద్దు ! స్వర్గలోకాధిపత్యం యిచ్చినా నాకు వద్దు! నా సుశీల తప్ప యింకేదీ నాకు వద్దు!...

'నువ్విలా మాట్లాడకుండా కూర్చుంటే నేనొప్పుకోను. కట్టి తీరాల్సిందే!'

వీళ్లంతా తనను బలవంతం చేస్తున్నారు. గౌరిమెడలో తాళి కట్టడానికి తాను సిద్ధంగాలేడు. తన నిర్ణయాన్ని యింత హఠాత్తుగా మార్చుకోమంటారేం వీళ్ళు ? ఏమీ ఆలోచించుకోలేకపోతున్నాడు తాను. వీళ్లు ఓ వారంరోజులు తనకు గడువివ్వరాదూ? బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రావచ్చు. ఎలాంటి నిర్ణయం అది? తాను గౌరిని పెళ్లిచేసుకోవాలనుకుంటాడా? సుశీలతో రేపు తనకు పెళ్లి జరగాలికదా! దానికి గడువెవరిస్తారు ? తాను సుశీలను పెళ్లి చేసుకుంటే గౌరి గతేం కావాలి ? ఇప్పుడు వున్నట్టుండి గౌరి మెడలో బొట్టు కడితే, సుశీలను కోరుకుంటున్న తన బ్రతుకేం కావాలి? ఆ పెళ్లి ఏం కావాలి? అందరూ తనను ఏమంటారు ?... ఈ సమస్యను తప్పించుకోవడం ఎలా ? ఇది గడువుతో తీరే సమస్య కాదు. రిప్ వాన్ వింకిల్ లాగా ఇరవైఏళ్లు ఈ కొండమీదపడి నిద్రపోవాలి! మళ్లీ లేచేటప్పటికి – ఈ సమస్య పరిష్కారమైపోయి వుంటుంది.

కాలం గడిచిపోతోంది. నాగరాజు ఏదో మాట్లాడుతున్నాడు. సుందరం చెవిటివాడిలా కూర్చుని వున్నాడు.

నాగరాజు మత్తు క్రమంగా వొదిలిపోతోంది. మత్తు తగ్గిపోతున్నకొద్దీ, అతనిలో కోపం పెరిగిపోసాగింది.

'కట్టవూ?' అంటూ పళ్లు పటపట గీటాడు అతను.

సుందరం తలవంచుకున్నాడు.

నాగరాజు కాలితో బలంగా అతని డొక్కలో ఒక్క తన్ను తన్నాడు. సుందరం బాధతో 'అమ్మా' అని మూలిగి, కడుపు చేత్తో పట్టుకున్నాడు.

నాగరాజుగొంతు కోపంవల్ల అదురుతోంది. 'వెధవా ! రౌడీ వెధవా! నా కూతురిబతుకు గంగలో కలిపేద్దామనుకున్నావా? వూరికే విడిచిపెట్టేస్తాననుకున్నావా? అది బాగుంటేనే నువ్వూ వుంటావు. చెడిపోయే రాతే దానికుంటే, నువ్విక్కడే చస్తావు'.

'మంత్రాలతో మామిడికాయలు రాల్తాయా ? దొంగవెధవ! నాలుగు తంతే వాడే కడతాడు' అంటూ వాసుకూడా సుందరం వీపు మీద ఒక తన్ను తన్నాడు.

'ఇప్పుడెందుకులెండి గొడవ ! ముహూర్తం కూడా ఎప్పుడో దాటిపోయింది' అన్నాడు పురోహితుడు.

'పోతే పోయింది. వాడు ఆ పాడుపని ముహూర్తం చూసే చేశాడా? వాడు తాళి ఎప్పుడు కడతాడో– అదే ముహూర్తం! కానీ!' అంటూ గద్దించాడు నాగరాజు.

సుందరం జాలిగా అతనివైపు చూశాడు.

...నాగరాజూ! నన్ను క్షమించు! నీ బాధ నేను అర్థం చేసుకోగలను. నా వేదనకంటే నీ వేదన ఎక్కువైనది! నీ వేదనకు ఒక కారకుణ్ణి నిలబెట్టటంకోసం నా దురదృష్టదేవత నన్నే వరించింది. పాపం! నాగరాజూ! నువ్వెంత మథనపడుతున్నావు ! నా ప్రాణంతో నీ వేదన తీరిపోగలిగితే చెప్పు– నా ప్రాణాన్ని సంతోషంగా నీకు దానం చేస్తాను...

సుందరాన్ని అందరూ నోటికి వచ్చినట్టు తిడుతున్నారు. గౌరి మాత్రం ఊపిరి బిగపట్టి కూర్చొంది.

నాగరాజు మొలలోంచి చాకు బయటికి తీశాడు. దాని మొన వెన్నెల్లో తళుక్కున మెరిసింది. ఎర్రగా కాలిన ఇనుపచువ్వల్లాంటి చూపులతో అతను సుందరంమీదికి వంగాడు.

భయవిహ్వలయై చూస్తున్న గౌరి 'వొద్దు నాన్నా!' అని కేక పెట్టింది.

సుందరంచొక్కా చర్రున చిరిగింది. అతని వక్షస్థలంమీద పొడుగ్గా ఎర్రటిగీత పడింది.

'నా కూతుర్ని కట్టుకోవటంకంటే ఈ చిత్రహింసే నీకు బాగుందా?' అని క్రూరంగా నవ్వాడు నాగరాజు.

హఠాత్తుగా రామలింగం – ముందుకు దూకాడు. నాగరాజు చేతిని గట్టిగా పట్టుకున్నాడు. 'వొద్దు! వాణ్ణి ఏమీ చెయ్యొద్దు !

వాడు తాళికట్టకపోతేనేం? గౌరినే కట్టుకోమందాం! వాడే కట్టాడని చెబితే సరిపోతుంది!'

నాగరాజు అతన్ని పక్కకు నెట్టివేశాడు. 'ఏం ? ఎందుకు కట్టడూ? నా కూతురుతో కులికినప్పుడు ఈ నంగనాచితనం ఏమైంది?... వీల్లేదు! వాడే కట్టాలి!' అంటూ మళ్ళీ సుందరం వైపు కత్తి వూపాడు.

'తొందరపడకు! వాడే కడతాడులే! నేను చెప్పి ఒప్పిస్తాను'

'సరే! ఒప్పించు మరి!'

రామలింగం సుందరంముందర కూర్చున్నాడు. సుందరానికి చాలా సంతోషం వేసింది. తన మిత్రుడు సిగ్గుపడేలా సూటిగా అతని కళ్ళలోకి చూశాడు.

రామలింగానికి ఏడుపొచ్చింది.

'నన్ను క్షమించురా సుందరం!... వాళ్ళు చెప్పినట్లు చెయ్యిరా! లేకుంటే చంపేస్తారురా! ప్రాణాలు దక్కించుకోరా!' అంటూ గడ్డం పట్టుకొన్నాడు.

సుందరం సంతోషంతో పులకించిపోయాడు. బదులుమాట్లాడకుండా చిరునవ్వు నవ్వాడు... చాలు రామలింగం! మిత్రుడిగా నీనుండి యింతకంటే యింకేమీ కోరను. నీ వంచన ఉల్లిపొరలా ఎగిరిపోయింది. నీ పాపం మంచులా కరిగిపోయింది. ఇప్పుడు నువ్వెంతో పరిశుద్ధంగా వున్నావు! ...

రామలింగం చాలాసేపు బ్రతిమాలుకున్నాడు. సుందరం ఒక్కమాటకూడా మాట్లాడలేదు.

రామలింగం కోపంతో అతన్ని నెట్టివేస్తూ పైకి లేచాడు. 'సరే! చావు! నీకు చావాలని వుంది. దిక్కులేకుండా చావు !' అంటూ పక్కకు తప్పుకున్నాడు.

పురోహితుడు గజగజలాడిపోతున్నాడు. 'నేను చూడలేను బాబూ! కళ్ళు తిరిగిపోతున్నాయి. నేను యింట్లోకి వెళ్లిపోతాను'

'వెళ్లిపో!' అంటూ ఈసడించుకున్నాడు నాగరాజు.

పురోహితుడు తొట్రుపడుతూ నాలుగడుగులు వేశాడు. 'అటుకాదు. ఇల్లు ఈవైపు!' అంటూ అతని చెయ్యి పట్టుకున్నాడు రామలింగం.

'నాయనా! నన్ను ఇంట్లో విడిచిపెట్టేయి నాయనా! ... శివ శివా!... శివశివా!'

రామలింగం అతన్ని ఇరవై బారల దూరంలోవున్న ఇంటివరకూ నడిపించాడు. తలుపు మూసివుంది. లోపల పురోహితుడి ముసలితల్లి రాగాలుతీస్తూ ఏడుస్తోంది.

'ఇదెక్కడి ఘోరంరా దేవుడో! వాళ్ళు ఆ కుర్రాణ్ణి చిత్రవధ చేసేస్తున్నార్రా దేవుడో!...'

ఊపిరి బిగబట్టి పడుకున్న ఆమెకోడలు 'వూరుకో! పిల్లలు లేస్తే జడుసుకుంటారు' అంటూ కోపంగా కసురుకుంటోంది.

'ఒసే! తలుపు తియ్యి!' అన్నాడు పురోహితుడు.

లోపల మాటలు ఆగిపోయాయి. శ్వాసకూడా వినిపించలేదు. గాలికూడా కదల్లేదు.

'ఒసేయ్! నేనే! తలుపుతియ్యి!'

లోపల మళ్ళీ చలనం ప్రారంభమైంది.

'మీరేనా?'

కిర్రున తలుపు తెరుచుకొన్నది. పురోహితుడు గబుక్కున లోపలికి దూరాడు. దభేలున మూసుకుపోయింది.

'శివశివా!...'

రామలింగం ఓ గుండుచాటుకు వెళ్లాడు. సందేహిస్తూ క్షణకాలం నిలబడ్డాడు. బండలను చాటుచేసుకుని, రాళ్లమీద చప్పుడు కాకుండా నడుస్తూ కొండ దిగాడు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది.

తుపాకి చప్పుడు విని భయపడిన కుందేలులా పరుగందుకున్నాడు రామలింగం. తాను అనుకున్నదొకటీ, ఔతున్నది మరొకటీ! నాగరాజుమీద అభిమానంతో సుందరాన్ని తీసుకొచ్చాడుగానీ, అతని పట్ల అఘాయిత్యాన్ని తాను ఊహించలేదు. సుందరాన్ని కాపాడటానికి ఏమాత్రం అవకాశమున్నా-దాన్ని జారిపోనివ్వకూడదు.

వెన్నెల్లో పరుగిడుతూన్న లేడిపిల్లలా వున్నాడు రామలింగం.

...ఈ శరీరం నాదికాదు. నాదికాని ఈ శరీరాన్ని గురించి నేనెందుకు బాధపడాలి ? ... ఇలా అనుకుంటూ వుంటే నా బాధ తగ్గిపోతూ వుంది. ఎంత చిత్రం! ఈ శరీరం కంటికి కనిపిస్తోంది. ఆ బాధ కంటికి కనిపించటంలేదు. అయినా, పాము కప్పను మింగినట్లు అది నా శరీరాన్ని పట్టుకుంటోంది. నా శరీరానికీ, నాకూ ఉన్న సంబంధాన్ని ఆసరాగా తీసుకుని అది నన్ను బెదిరిస్తోంది. ఈ శరీరాన్ని పరిత్యజించేస్తాను. ఆ బాధ నన్నేమీ చేయజాలదు...

గొర్రెపిల్లలాంటి సుందరం— సాధుజంతువులాంటి సుందరం— దుర్మార్గుడు ఎదురుగా వస్తే దారి యిచ్చి పక్కకు తొలగిపోయే సుందరం—వార్తాపత్రికల్లో వెలువడే ఘోరవార్తల్ని చదివి దిగులుపడిపోయే సుందరం— ఈనాడు మహాక్రూరుడైపోయాడు. రజో గుణానికీ, సత్వ గుణానికీ నడుమ సంకుల సమరం చెలరేగింది. ఎరుపు మీద ప్రతీకారం తీర్చుకోవాలి! ఇప్పుడది తోడేలులా తనమీద విరుచుకు పడుతున్నది.

తూర్పున వేగుచుక్క పొడిచింది.

చంద్రబింబం పడమటివైపు జారిపోతున్నది.

ఈ వేకువ చాలా అందంగా వుంది. నిశ్శబ్దగంభీరంగా వుంది. ఇలాంటి వేకువలో విహరించాలంటే, ప్రాణం ఎంతో పుణ్యం చేసుకుని వుండాలి.

సుందరం చంద్రుణ్ణి చూస్తున్నాడు. మసకబారిన చంద్రుడు మతంలాగా, గుడ్డిగా నవ్వుతున్నాడు.

వెన్నెల్లో రాలిపడ్డ నిప్పుతునకలా వున్నాడు నాగరాజు.

'ఊఁ! కానీ!' అన్నాడు.

సుందరంలో చలనం లేదు.

నాగరాజు బాకుతో అతని వీపుమీద ఒక్కపోటు పొడిచాడు. సుందరం బాధగా మూలిగాడు.

అయ్యో సుందరం ! చివరికి నీ బ్రతుకిలా విషాదాంతమై పోయిందా! నువ్వు నమ్ముకున్న దేవుడికి బుద్ధిలేదు. వాణ్ణి క్షమించు!

గౌరి కెవ్వున కేకవేసి నేలకు అంటుకుపోయింది.

...గౌరీ! నీ దురాశతో ఎందుకు నాకు బంధం వేశావు ? ఈ పాపం, ఈ మరణం — ఇవి రెండూ నువ్వు ప్రసవించిన కవల పిల్లలు! చూడు! చూడు! కళ్లు మూసుకున్నావేం?...

సుందరం మళ్లీ చందమామవైపు చూశాడు.

...చంద్రుడా! నీకు జాలిలేదు!...

'కట్టవూ?' అంటూ మళ్లీ ఉరిమాడు నాగరాజు.

సుందరంతల కిందికి వాలిపోతోంది.

నాగరాజు అతనిగుండెల మీద ఇంకో పోటు పొడిచాడు.

సుందరం క్రిందికి ఒరిగిపోయాడు.

వున్నట్టుండి వాసు గాభరాగా కేకవేశాడు. "పోలీసులు ! కొండకింద పోలీసులొస్తున్నారు!'

సుందరం చుట్టూ వున్నవాళ్లందరూ తలొకదిక్కుగా పరుగందుకున్నారు.

మసకవెన్నెల నెత్తుటితో తడిసిపోయింది.

★ ★ ★

సుందరం కళ్లు తెరిచాడు.

అతనితల గౌరిఒడిలో వుంది. ఆమె ఏడుస్తోంది.

సుందరానికి జాలివేసింది. తన జీవితం అంతమైపోతోంది. కాని, గౌరి బ్రతుకేం కావాలి? ఆమెకడుపులోని బిడ్డ ఏంకావాలి ? గౌరికి భర్తగా, ఆ బిడ్డకు తండ్రిగా తాను చచ్చిపోవాలి!

సుశీల యిక తనకు అందదు. ఇక తాను జీవించబోయే కొన్ని క్షణాల్లో, గౌరికి తాను చేయగలిగింది చేస్తే ఏంపోయింది? ... సుశీలను మోసంచేసి, ఆమెకు కనిపించకుండా దూరంగా పారిపోవాలి !

సుందరం గౌరితో మాట్లాడాలనుకున్నాడు. మాట్లాడలేక పోయాడు. అతికష్టంమీద మెల్లగా లేచికూర్చున్నాడు. రక్తసిక్తమైన మంగళసూత్రాన్ని ఆమెమెడలో కట్టాడు. అశక్తంగా ఆమె ఒడిలో పడిపోయాడు.

గౌరి గుండె బ్రద్దలై ఏడువసాగింది.

'సుందర్ ! నన్ను మన్నించు సుందర్ ! నిన్ను నేనే చంపేశాను. నన్నేంచేసినా పాపంలేదు'

తూరుపుదిక్కున — కొలిమిలో మెరిసే మంటల్లా ఎర్రటి కాంతులు పరుచుకుంటున్నాయి.

ఎరుపు!

నీలికళ్లలాంటి ఆకాశంలో నెత్తుటిజీరల్లాంటి ఎరుపు!

గాయంలాంటి ఎరుపు! గొడ్డుకారంలాంటి ఎరుపు!

అపాయంలాంటి ఎరుపు! అవమానంలాంటి ఎరుపు!

పగలాంటి ఎరుపు! పాపంలాంటి ఎరుపు!

కామంలాంటి ఎరుపు! క్రౌర్యంలాంటి ఎరుపు!

కన్నతల్లిశోకంలాంటి ఎరుపు!

కాలిపోతున్న బ్రతుకులాంటి ఎరుపు!

గౌరికడుపులో ప్రాణంపోసుకుంటున్న నెత్తుటిముద్దలాంటి ఎరుపు!

దేవుడి కన్నీళ్లలాంటి ఎరుపు!

ఈ ఎరుపు ఏరై తనమీద పార్లి ప్రవహిస్తోంది.

చిత్రం! ఎదుట నిలబడ్డ పోలీసుటోపీకూడా ఎర్రగానే వుంది! సుశీల ఈపాటికి ఒళ్లువిరుచుకుంటూ నిద్రలేస్తూవుంటుంది. ఆమె బుగ్గలమీది సిగ్గుకూడా ఎర్రగానే వుంటుంది!

సుందరంకళ్లు మూతలుపడ్డాయి.

ఇది తనకు అంతిమక్షణం!

ఈ క్షణంలో దేవుణ్ణి స్మరించాలి.

నువ్వు అత్యంత ప్రియంగా పూజించే ప్రేమమూర్తిని దేవుడి స్థానంలో నిలుపుకో!

...అమ్మా! నాకోసం ఏడ్చే నా దైవం! ... అయ్యో, అమ్మా! నిన్ను తలుచుకుంటూవుంటే నా గుండె చెరువైపోతూవుంది. నిన్ను ఉద్ధరించడానికి నేను పుట్టలేదు. నీ కడుపులో చిచ్చుపెట్టడానికి పుట్టాను. నిన్ను తలచుకోవడంవల్ల కలిగే వేదన ఈ కత్తిగాయా!

వల్ల కలిగే బాధకంటే ఎక్కువగాఉంది. నా ఊహల్లోనుంచి వెళ్లిపో అమ్మా!...

సుందరం పెదవుల్లోంచి అస్పష్టంగా ఓ మాట వెలువడింది.

అతడు పలికిన చివరిమాట అదే!

'సుశీ!'

ఆ శబ్దాన్ని మోయలేక గాలి బరువుగా మూలిగింది.

వార్త శబ్దరూపాన్ని ధరించడానికి ఆధారభూతమైనది గాలి. 'అయ్యో సుందరం! ఈ విషాద వార్తను నీ తల్లికీ, నీ ప్రేయసికీ ఎలా చెప్పమంటావు? అంత క్రూరమైన పని నన్ను ఎలా చేయమంటావు?' అంటూ ప్రభాతవాయువు పరమసాత్వికునిలా రోదించింది.

—: సమాప్తము :—

అంకితం

నాకు ఊపిరి పోసి
పెంచి
పెద్ద చేసిన
ఆంధ్రపత్రికా కుటుంబానికి
సభక్తికంగా

—సదానంద

---

# అహమ్

శ్రీ తిరునగరి

ఏదీ నాది కాదంటూ
వేదాంతాన్ని వల్లించలేను
ఊపిరి ఉన్నంతకాలం
ఉన్నదంతా నాదే నంటాను

నాగరికతాసుందరి లాస్యం చూస్తూ
నగరంలో గడుపడం నాకు సరదా
పాలమనసులున్న జానపదులున్న
పల్లెసీమల్లో బ్రదుకడం వరంకాదా!

గుహల్లోకి పారిపోదామనే
గొప్ప గొప్ప వాళ్ళు
దృశ్యమంతా మిథ్య అని
అదృశ్యమరీచికలవైపే మొగ్గితే—

నా కీ కనిపించే జగత్తు
సత్యం, శివం, సుందరం

నేను మానవుణ్ణి
పరమాత్ముణ్ణి సైతం

పరమ దౌర్భాగ్యునిలో సందర్శిస్తాను
ఏకాంతరామయ్య సాక్షాత్కారంకోసం
ఎక్కడో రుద్రాక్షమాలికలు త్రిప్పలేక
ప్రతి నరునిలో రామయ్యనే చూడాలని
శ్రుతి తప్పిన వీణను సరిచేస్తాను

కష్టాలు నావి
కన్నీళ్ళు నావి
రేపు నాది
నా రేపుకు రూపమిచ్చే
మేధస్సు నాది
అందుకే నేను వర్తమానాన్ని
జ్వలించే వాస్తవాన్ని
నాకు శత్రువు మిథ్య
ఆశ నాకెప్పుడూ అందాల హరిమధ్య.